క్లుప్తంగా

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.5.97 లక్షలు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయ హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. మే నెల 17 నుంచి నేటివరకు 55 రోజులకు గాను హుండీ ద్వారా రూ.5,97,749 ఆదాయం సమకూరినట్లు ఆలయ పర్యవేక్షణ అధికారి వి.రాధాకృష్ణ తెలిపారు. ఆలయ ఈఓ, అర్చకులు సమక్షంలో హుండీ కానుకలను లెక్కించారు.

ఎరువుల పంపిణీకి సిద్ధం

పాలకొండ: ఖరీఫ్‌లో రైతులకు రాయితీపై అందించేందుకు ప్రభుత్వం ఎరువులను సిద్ధం చేసిందని మండల వ్యవసాయశాఖ అధికారి వై.వాహిని తెలిపారు. కావాల్సిన రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రాల్లో ఉన్న సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. యూరియా, డీఏపీలతో పాటుగా ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఉత్తమ కార్టూన్‌గా ఎంపిక

గరుగుబిల్లి: నెల్లూరుకు చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ టీవీ రాంప్రసాద్ నిర్వహించిన కార్టూన్ పోటీల్లో మండలంలోని రావివలస గ్రామానికి చెందిన గుంట్రెడ్డి భాస్కరరావు వేసిన కార్టూన్‌కు బహుమతి వరించింది. 'ఫంక్షన్ హాల్-డైనింగ్ హాల్'పై ఆలయ వేసిన కార్టూన్ ఉత్తమ కార్టూన్‌గా ఎంపికైంది. ఆయనకు బహుమతితోపాటు ప్రశంసా పత్రాన్ని అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బహుమతి రావడం పట్ల పలువురు సాహితీ మిత్రులు భాస్కరరావుకు అభినందనలు తెలియజేశారు.

చురుగ్గా డ్రోన్ సర్వే



డ్రోన్‌తో సర్వే చేస్తున్న సిబ్బంది

భామిని: మండలంలో వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూసర్వేలో భాగంగా మండలంలోని నేరడి-బి, పాలవలస రెవెన్యూ గ్రూపు పరిధిలోని గ్రామాల్లో సోమవారం డ్రోన్ సర్వే నిర్వహించారు. సర్వేయర్ కుండింగి రమణ నేతృత్వంలో సర్వే, సాంకేతిక బృందం భూముల సరిహద్దులు గుర్తించారు. నేరడి-బి సమీపంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దు భూములను సహితం డ్రోన్ సాయంతో గుర్తించారు. పాలవలసలో సర్వే పూర్తయినట్లు సిబ్బంది తెలిపారు.

సాగునీరు అందించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ రామారావు, రైతులు

భామిని: మండలంలోని సతివాడ గ్రామానికి సాగునీరు అందించే కొండవాగు దారిని కప్పేయడంతో భైరాగినాయుడు చెరువుకు నీరు అందడం లేదని సర్పంచ్ పాశర్ల రామారావుతో పాటు ఆయకట్టు రైతులు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ నీలాపు అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. జక్కరగెడ్డ నుంచి కొండవాగుకు నీరు భైరాగినాయుడు చెరువుకు వచ్చేదని, కొండవాగును కప్పేయడంతో నీరు రావడం లేదని వివరించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, సర్వేయర్ రాజేశ్వరరావును తహసీల్దార్ అప్పారావు ఆదేశించారు.

ఊరటనిచ్చిన వర్షం



పాలకొండ పట్టణంలో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: గత కొద్ది రోజులుగా వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు సోమవారం పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా కురిసిన వర్షం ఊరటనిచ్చింది. ఖరీఫ్ ప్రారంభ దశలో వాతావరణ అనుకూలతపై ఆధారపడి వరి వంగడాలను వెదలు జల్లిన రైతులు వర్షాలపై భారం వేసి సేద్యానికి సిద్ధపడ్డారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా వెదలు మొలక దశలో ఉన్నాయి. కీలక సమయంలో వర్షం కురవడంతో అన్నదాతలు సంతోషపడుతున్నారు.

భామినిలో..

భామిని: మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గత కొన్నిరోజులుగా వర్షాలు లేక వరి నారుమడులు ఎండిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎండ, ఉక్కపోతలో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో ఊరట లభించినట్లయింది.

జీవాలు జాగ్రత్త!

- వర్షాకాలంలో గొర్రెల్లో కాలిపుండు వ్యాధి సోకే ప్రమాదం
- అవగాహన, అప్రమత్తతతో జీవాలు సురక్షితం



పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తిచెందే ప్రమాదముందని, గొర్రెలకాపర్లు అప్రమత్తంగా ఉంటూ జీవాల ఆరోగ్యం పట్ల సరైన జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారి బచ్చు సిద్ధార్థ సూచించారు. మేతకు వెళ్లే గొర్రెల మందలు వర్షాల్లో తడవటం, మురికి కుంటల్లో, నిల్వ ఉన్న నీటిలో అధిక సమయం ఉండటం వలన, చిత్తడి నేలల్లో తిరగటం వల్ల ఈ వ్యాధి వ్యాప్తించెందుతుందన్నారు. దీనిని ముందుగా గుర్తించకుంటే మందలోని మిగతా గొర్రెలకు కూడా వ్యాపిస్తుందన్నారు.

వ్యాధి లక్షణాలు..

ఈ వ్యాధి సోకిన గొర్రెలు సరిగా నడవలేక ఇబ్బందులు పడతాయి. సరిగా మేతమేయవు. బరువు తగ్గుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందినట్లు కందిపోయి ఉంటుంది. వ్యాధి తీవ్రమైతే గిట్టల మధ్య చీము పట్టి చెడు వాసన వస్తుంది. గిట్టలు ఊడిపోయే ప్రమాదం ఉంది.

చికిత్స..

వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే గొర్రెలకు సరైన చికిత్స అందించాలి. వ్యాధి సోకిన గిట్టలను 10శాతం మైలతుత్తము ద్రావణంతో కానీ, 10శాతం జింకు సల్ఫేట్ ద్రావణంతో లేక 5శాతం ఫార్మలిన్ ద్రావణంతో శుభ్రం చేయాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేయటం వలన ఫలితం ఉంటుంది. వైద్యుల సూచనల మేరకు యాంటీబయాటిక్ మందులను దాదాపు 30 రోజులు వరకు పూతపూయాలి.

నివారణ..

ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే వ్యాధిసోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి. మందలను చిత్తడి, నీరు నిలిచే నేలలకు దూరంగా ఉంచాలి. జీవాలను పెంచే ప్రదేశాలల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలి. ఎప్పటి కప్పుడు వైద్యుల సూచనలమేరకు మందులు వేయాలి.

నియోజకవర్గంలో గొర్రెల వివరాలు

మండలం	గొర్రెల సంఖ్య
పాలకొండ	21641
వీరఘట్టం	27454
సీతంపేట	7959
భామిని	8957

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మహిళకు సంక్షేమ లబ్ధిపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించటమే ప్రభుత్వం ముందున్న లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని వలసబల్లేరు పంచాయతీ పరిధి వలసగూడ, లంకాజోడు, వలసబల్లేరు గిరిజన గ్రామాల్లో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీ ఊలక కృష్ణవేణి, విద్యారాణి, గ్రామ సర్పంచ్ గౌరీ, నీలకంఠాపురం సర్పంచ్ మన్మథరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకటరావు, రేవు సత్తిబాబు, బిడ్డిక అనంత్, ఇంటికుప్పల రామకృష్ణ, ఊయక మధు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువల్లేని వ్యక్తి పవన్

- వలంటర్లకు క్షమాపణ చెప్పాలి
- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: రాష్ట్ర రాజకీయాల్లో కనీస నైతిక విలువలు లేని వ్యక్తి పవన్ కల్యాణ్ అని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వలంటీర్లపై పవన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కితీసుకుని వారికి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వలంటీర్లపై నీచంగా మాట్లాతున్న..పవన్ కన్నా క్రిమినల్ ఎవరున్నారని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ పోరాటం, ఆరాటం అంతా చంద్రబాబు కోసమేనని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గద్దెదించి మరి ఎవర్ని గద్దెనెక్కిస్తాడో చెప్పే ధైర్యం లేని వ్యక్తి పవన్ కల్యాణ్ అని విమర్శించారు. చంద్రబాబు హయాంలో టీడీపీ ప్రభుత్వంపై కాగ్ అక్షింతలు వేయని సంవత్సరం ఏదైనా ఉందా అన్ని ప్రశ్నించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఏకవచనంతో పిలిచే అర్హత నీకెక్కడిది, వంద జన్మలెత్తినా జగన్ స్థాయికి నీవు చేరుకోలేవు, బాబు అధికారం కోసం చేసే నీ పోరాటం వృథానే అని విక్రాంత్ ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై నియోజకవర్గాల్లోని ప్రజా సమస్యలపై ఏమాత్రం అవగాహన లేకుండా మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వారాహి యాత్ర మొత్తం బూతులు, దూషణలతోనే సాగుతోందన్నారు. కరోనా కష్టకాలంలో వలంటర్లు చేసిన సేవలను దేశమంతా మెచ్చుకుంటుంటే పవన్ కల్యాణ్‌కు మాత్రం వలంటీర్ల సేవలు కనిపించకపోవడం చాలా దారుణమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లుండీ చూడలేని ధృతరాష్ట్రుడు పవన్ కల్యాణ్ అన్ని విక్రాంత్ దుయ్యబట్టారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూడలేక ఏదో ఒక ఆరోపణలు చేసి పవన్ కల్యాణ్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా చేసిన తప్పులను సరిదిద్దుకోకపోతే వలంటీర్లతో పాటు ప్రజలు కూడా పవన్‌ను తరిమికొడతారన్నారు. ఆయనతో పాటు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, తూడి సర్పంచ్ కె.వెంకటరమణమూర్తి, రంభ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గర్భిణికి 108 సిబ్బంది సేవలు



గర్భిణికి సుఖప్రసవం చేసిన ఈఎంటీ రాములు

సీతంపేట: మండలంలోని సందిగూడకు చెందిన గర్భిణి లిమ్మల సునీతకు 108 సిబ్బంది ప్రసవం చేశారు. సునీతకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు గ్రామానికి చెందిన ఆశా వర్కర్ సాయంతో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ రాములు ఆమెకు ఇంటి వద్దే తగిన చికిత్స అందించడంతో ఆమె పండంటి ఆడబిడ్డను ప్రసవించింది. అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం తల్లీబిడ్డను స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. సమయానికి చేరుకుని తల్లీబిడ్డలను కాపాడిన ఈఎంటీ, పైలెట్‌ను గ్రామస్తులు అభినందించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు ఏ దశలో ఉన్నయో తెలుసుకునేందుకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం ఇంజినీరింగ్ అధికారులు, సర్పంచ్‌లతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాల గురించి మండల ఇంజినీరింగ్ అధికారి డి.కల్యాణిదుర్గను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పనుల ప్రారంభించని వాటిని త్వరగా ప్రారంభించాలని, నిర్మాణ దశలో ఉన్న పనులను వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం

పార్వతీపురం: జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త డా.హిరాలాల్ చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి మత్స్యశాఖలో ఆయన చేసిన సేవలను కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య మాట్లాడుతూ హిరాలాల్ కృషితో గణనీయంగా కృత్రిమ చేపపిల్లల ఉత్పత్తి పెరిగిందన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం వైస్‌చైర్మన్ లక్ష్మణరావు, ఎం.శ్రీనివాసరావు తదితరసులు పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 134 వినతులు



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఐటీడీఏలో ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 134 వినతులు వచ్చాయి. సాగు హక్కు పట్టాలు ఇప్పించాలని పుట్టూరు గ్రామస్తులు కోరారు. చేపపిల్లలు పంపిణీ చేయాలని బమ్మిడికి చెందిన కిషోర్, కంప్యూటర్ తూనిక కాటా మంజూరు చేయాలని పెద్దపొల్లకు చెందిన లవకుశ, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేయాలని కుంబిరగంకు చెందిన సోన్యా వినతులు అందజేశారు. అలాగే పవర్‌ఫీడర్ మంజూరు చేయాలని పెద్దదిమిలికి చెందిన సావిత్రి, తమ గ్రామానికి రహదారి నిర్మించాలని భరణికోట గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలతో హాజరుకావాలి



భూ హక్కుదారుల సమక్షంలో వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: గ్రామాల్లో జరుగుతున్న భూముల సమగ్ర రీసర్వేకి రైతులు, భూ హక్కుదారులు సహకరించాలని, సర్వే చేపడుతున్న భూముల వద్దకు సంబంధిత హక్కుదారులు పట్టాదారు పాసుపుస్తకాలతో హాజరుకావాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు కోరారు. వీరఘట్టం రహదారిలో ఉన్న తోటల్లో సోమవారం చేపట్టిన రీసర్వేను ఆయన పర్యవేక్షించారు. సర్వే సిబ్బంది ముందస్తుగా అందిస్తున్న సమాచారం మేరకు భూ యజమానులు కచ్చితంగా హాజరుకావాలని కోరారు. దగ్గరుండి వివరాలు నమోదు చేసుకోవాలని, తప్పులు ఏమైనా గుర్తిస్తే వెంటనే సర్వే బృందాలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సర్వేలో తప్పులు జరగకుండా రోవర్, డ్రోన్ వంటి సాంకేతిక పరికరాలను వినియోగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్వోలు సాయి శ్రీనివాస్, రామారావు, సహాయ సర్వేయర్లు జి.గణేష్, మణి, నాగరాజు తదితరులున్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. పోలీసు అధికారులు వారి పరిధిలో గల సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన నివేదికలను తనకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ ఎన్.శ్రీనివాస రావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ ప్రభాకర్, పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు, ఏఆర్ ఆర్ఐ శ్రీరాములు, డీసీఆర్‌బీ ఎస్సై దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.

జనరంజకంగా జగనన్న పాలన



సంక్షేమ లబ్ధిపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన జనరంజకంగా సాగుతోందని, సంక్షేమం, అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మర్రిపాడు గ్రామ సచివాలయం పరిధిలో ఎగువ ద్వారబందం, నడిమిద్వారబందం, దిగువ ద్వారబందం, రేగులగూడ, మూలగూడ, గూడ గుడ్డి, తోటగూడ గ్రామాల్లో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. టీడీపీ పాలనలో సంక్షేమ పథకాల కోసం అనేక పాట్లు పడాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రజలకు మంచి జరిగేలా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పాలకొండ ఏఎంసీ చైర్మన్ హిమరక మోహనరావు, సర్పంచ్ రమ, ఏఓ నిమ్మల మాస, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేసే గ్రామ వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ విషం చిమ్మడం ఆయన స్థాయికి తగదని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మండిపడ్డారు. మండలంలోని ఘనసరలో జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, పార్టీ కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావు, ఒడ వెంకటరమణ సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కరోనా కష్టకాలంలో ఏపీ వైపు కనీసం చూడని పీకేకు వలంటీర్లు చేసిన సేవలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించిన వలంటీర్లను కించపరిచి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం సిగ్గుచేటని మండిపడ్డారు. మహిళల కోసం చిలకమ్మ కబుర్లు చెప్పే నేతకు వలంటీర్లలో సగం మంది మహిళలే ఉన్నారనే విజ్ఞత లేకపోవడం శోచనీయమన్నారు. పవన్ కల్యాణ్ తన వాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే వలంటీర్లే పవన్‌కు తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష



మాట్లాడుతున్న చంద్రశేఖర్, రాంప్రసాద్

భామిని: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు ప్రత్యేక దృష్టి పెట్టి నిర్వహించాలని జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, ఎంఎల్ఓ రాంప్రసాద్ సూచించారు. మండలంలోని నేరడి-బి, వడ్డంగి, ఘనసర, నులకజోడు, బురుజోల, చిన్నదిమిలి, పెద్దదిమిలి, కోసలి సచివాలయాల్లో సోమవారం వలంటీర్లతో సమావేశమై జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై సూచనలు చేశారు. ముందస్తుగా వలంటీర్లు క్లస్టర్ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాల వివరాలను నమోదు చేయాలని సూచించారు.

కామ్రేడ్లు సత్యం, కైలాసంకు ఘన నివాళి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య

గుమ్మలక్ష్మీపురం/కురుపాం:

గిరిజనుల హక్కుల కోసం శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటం నడిపిన కామ్రేడ్లు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం 53వ వర్ధంతి సభను కురుపాం మండలం గుమ్మ గ్రామంలో సోమవారం సీపీఐ నాయకులు నిర్వహించారు. వెంపటాపు సత్యం కుమార్తె వెంపటాపు భారతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మన్యం ప్రాంతంలో గిరిజనుల హక్కుల కోసం, పాలేరు వ్యవస్థ రద్దు కోసం, అటవీ భూములు పంపిణీ చేయాలని కోరన్న, మంగన్నలు తొలుత పోరాటం సాగించారన్నారు. వారు అమరులైన తర్వాత ఈ పోరాటాన్ని సత్యం, కైలాసం ముందుకు నడిపారని అన్నారు. వారి పోరాటాల ఫలితంగానే గిరిజనులకు అనేక హక్కులు కల్పించబడ్డాయన్నారు. వారి పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, కుండంగి లింగరాజు, జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాద్, మోహనరావు, సింగన్న, ఇతర కమ్యూనిస్టు పార్టీలు, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో మొలకశాతం మెరుగు



సామూహిక విత్తనశుద్ధి చేస్తున్న రైతులు

గుమ్మలక్ష్మీపురం: బీజామృతంతో విత్తన శుద్ధి పంటలకు మేలని ఏపీసీఎన్ఎఫ్ లక్కగూడ క్లస్టర్ కోఆర్డినేటర్ (ఎల్-1)ప్రసాద్, ఎంటీ జి.నిర్మలదేవి అన్నారు. మండలంలోని పులిగూడ గ్రామంలో సోమవారం రైతులతో సామూహిక విత్తనశుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. బీజామృతంతో విత్తనాలను ఏలా శుద్ధి చేయాలో వివరించారు. ఖరీఫ్‌లో సాగు చేసే ప్రతీ పంట విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేయడం ద్వారా మొలక శాతం పెరగటంతో పాటు హానిచేసే సూక్ష్మజీవుల నుంచి రక్షణ లభిస్తుందని, ఫలితంగా దిగుబడి పెరుగుతుందని అన్నారు. వరి, చిరుధాన్యాలు, అపరాలు, నూనె గింజలు మొదలగు పంటలకు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు.